
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
5★★ జిల్లా వార్తలు
బుధవారం 8 అక్టోబరు 2025



జిల్లాకు మరో మణిహారం



- కేంద్రీయ విద్యాలయం మంజూరు చేస్తూ కేంద్రం నిర్ణయం
- చల్‌గల్‌లో ఏర్పాటుకు కసరత్తు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం
- ఈ ఏడాది కోరుట్లలో నవోదయ విద్యాలయం ఏర్పాటు

జగిత్యాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాలుగు కేంద్రీయ విద్యాలయాలు మంజూరు కాగా అందులో ఒకటి జగిత్యాల జిల్లాకు కేటాయించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మ పురి అర్వింద్ పలుమార్లు విజ్ఞప్తి చేయడంతో కేంద్రీయ విద్యాలయాన్ని జగిత్యాలకు మంజూరు చేస్తూ ఇటీవల కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. కేంద్రీయ విద్యాలయంలో ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యనభ్యసించే అవకాశం ఉంటుంది. కేంద్రీయ విద్యాలయంలో సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తారు.

● 25 ఎకరాల స్థలంలో ఏర్పాటుకు కసరత్తు

జిల్లా కేంద్రానికి సమీపాన జాతీయరహదారిని ఆనుకొని ఉన్న చల్‌గల్ వాలంతరి వ్యవసాయ ప్రదర్శన క్షేత్రంలో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. సుమారు 25 ఎకరాల స్థలంలో కేంద్రీయ విద్యాలయ భవన సముదాయం నిర్మాణం కానుంది. నాణ్యమైన విద్య, అత్యుత్తమ బోధన, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలతో కేంద్రీయ విద్యాలయాలు దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు బాగా డిమాండ్ ఉంది.

ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌కు సంబంధించి విద్యను అభ్యసించా లంటే రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకోలేని పరిస్థితి ఉంది. ఈ క్రమంలో కేంద్రీయ విద్యాలయం మంజూరు కావడంతో పేద, మధ్య తరగతి ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి బోధన జరిపేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

● కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు ప్రాధాన్యం..

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, మాజీ సైనికుల పిల్లలకు ప్రవేశాల్లో తొలి ప్రాధాన్యత కల్పిస్తారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వ, అనుబంధసంస్థల ఉద్యోగులకు వరుస గా రెండు, మూడు, నాలుగో ప్రాధాన్యత ఇస్తారు. మిగిలిన విద్యార్థులకు ఐదో ప్రాధాన్యతతో ప్రవేశాలు కల్పిస్తారు. కేంద్రీయవిద్యాలయంలో ఆన్‌లైన్‌పద్ధతిలో నామినల్ ఫీజుల తో అడ్మిషన్లు నిర్వహిస్తారు. జిల్లాలోని కోరుట్ల, ధర్మపురి, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కోటి చొప్పున ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ మంజూరు అయ్యాయి. ఆ స్కూళ్లకు సంబంధించి ఇంకా గ్రౌండ్ వర్క్ కొనసాగుతోంది. ప్రస్తుతం కేంద్రీయ విద్యాలయం రావడంతో జిల్లాలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉంది.

● నాణ్యమైన విద్య..

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో జగిత్యాల ప్రాంత విద్యార్థులకు జాతీయ స్థాయి సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందనున్నది. కేంద్రీయ విద్యాలయంలో సౌకర్యవంతమైన తరగతి గదులు, ప్రయోగశాలలు,...

- మిగతా 8లో

ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు..



జగిత్యాల జిల్లాకు కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేసిన ప్రధాని నరేంద్రమోదీతో పాటు కేంద్ర మంత్రివర్గానికి కృతజ్ఞతలు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందనుంది. ఇప్పటికే కోరుట్లలో నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేశాం. ప్రస్తుతం కేంద్రీయ విద్యాలయం మంజూరుతో పేదలకు ఉన్నతమైన విద్య మరింత చేరువ కానుంది.

-ధర్మపురి అర్వింద్, నిజామాబాద్ ఎంపీ

కేంద్రీయ విద్యాలయం మంజూరు హర్షణీయం



చల్‌గల్‌లో కేంద్రీయ విద్యాలయం మంజూరు చేస్తూ కేంద్రం నిర్ణ యం తీసుకోవడం హర్షణీయం. జగిత్యాల ప్రాంతంలోని ఉద్యోగులు, పేద, మధ్యతరగతి ప్రజలపిల్లలకు నాణ్యమైనబోధనను అందించనుం డడం సంతోషకరం. జగిత్యాల కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు.

-తాటిపర్తి జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి

ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

● అదనపు కలెక్టర్ రాజాగౌడ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజాగౌడ్

జగిత్యాల, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కమిటీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆసుపత్రి బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై తగిన శ్రద్ధ వహించాలని తెలిపారు. ఎవరు కూడా మున్సిపల్‌కు సంబంధించిన వాహనాలలో బయో మెడికల్ వేస్ట్‌జీని పారవేయకూడదని హెచ్చరించారు. జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 302 ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయని, నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణమూర్తి, ఆర్ఎంవో డాక్టర్ సుమన్, ఐఎంఏ కోశాధికారి డాక్టర్ కోటగిరి సుధీర్, మున్సిపల్ కమిషనర్లు స్పందన, మోహన్, మనోహర్, రవీందర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు వెంకటరమణ, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ పర్యవేక్షకులు కుతుబుద్దీన్, హెల్త్ ఎడ్యుకేటర్‌లు కటుకం భూమేశ్వర్, తరాల శంకర్, హెచ్ఈఓ రాజేశం తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి శ్యాంప్రసాద్

కొడిమ్యాల, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు ఆర్జించవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జి.శ్యాంప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని కోనాపూర్ గ్రామంలో ఉద్యాన శాఖ, లోహియా ఆయిల్ ఫాం కంపెనీ ఆధ్వర్యంలో మూడు సంవత్సరాలు ఉన్న ఆయిల్ ఫాం తోటలలో పరాగ సంపర్కం కోసం ఉపయోగపడు కీటకాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి మాట్లాడుతూ 2022-2023 సంవత్సరంలో నాటిన ఆయిల్ ఫాం తోటల నుంచి దిగుబడి తీసుకోవటానికి ఎలైడోబీయస్ కామెరూనికస్ అను కీటకాలను విడుదల చేయాల్సి ఉంటుందన్నారు. ఆయిల్ ఫాంలో ఒకే మొక్కపై ఆడ, మొగ పుష్పాలు పూస్తాయన్నారు. ఆయిల్ పామ్ కంపెనీ జిల్లా ప్రతినిధి విజయభరత్ మాట్లాడుతూ మూడు సంవత్సరాలు ఉన్న అన్ని తోటల్లో ఈ కీటకాలను విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఏవో భాస్కర్, కొడిమ్యాల ఏవో పి.జ్యోతి, ఉద్యాన విస్తరణ అధికారి అనిల్, పలువురు రైతులు పాల్గొన్నారు.

మంత్రి అడ్లూరిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసన

● ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 'పొన్నం' దిష్టిబొమ్మ దహనం

8లో..

ప్రజాప్రతినిధులు భావ వ్యక్తీకరణలో సంయమనం పాటించాలి

● మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి

జగిత్యాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధులు తమ భావ వ్యక్తీకరణలో సంయమనం పాటించాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌పై మరో మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. మంగళవారం జీవన్‌రెడ్డి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పట్ల మాట జారినట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో పొన్నం ప్రభాకర్ అనుకోకుండా మాట జారవచ్చన్నారు. పొన్నం తన మాట వెనక్కి తీసుకోవాలని, దీంతో హుందాతనం పెరగడంతో పాటు పార్టీ ప్రతిష్ఠ దిగజారకుండా ఉంటుందని అన్నారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కించపరిచే విధంగా మాట్లాడడం దురదృష్టకరమని అన్నారు. పొన్నం తన మాటలను వెనక్కి తీసుకుంటే గౌరవంగా ఉంటుందని జీవన్‌రెడ్డి అన్నారు.

'చైల్డ్ హెల్ప్ లైన్‌ను సద్వినియోగం చేసుకోవాలి'

గొల్లపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : చైల్డ్ హెల్ప్ లైన్ అనేది ఉచిత టోల్ ఫ్రీ నంబరు అని దీనిని సద్వినియోగం చేసుకోవాలని చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా అధికారి సామల రాజేశం సూచించారు. మంగళవారం గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో చైల్డ్ హెల్ప్ లైన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబరు 1098 అనేది ఉచితమని, బాలబాలికలు ఎదుర్కోనే వివిధ సమస్యలపై ఈ నెంబరును సంప్రదించవచ్చన్నారు. బాల్య నిరోధక వివాహ చట్టం 2006, పోక్సో చట్టం 2012, బాల కార్మికుల నిషేధ చట్టం 1986 తదితర చట్టాల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డా. శ్రీకాంత్, హెల్త్ సూపర్‌వైజర్లు నరేందర్, పోచమ్మ, శారద, కేసు వర్కర్ శ్రీకాంత్, వైద్యారోగ్య శాఖ సిబ్బంది, పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజేపై దాడికి నిరసనగా న్యాయవాదుల విధుల బహిష్కరణ



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

జగిత్యాల అర్బన్, అక్టోబరు7 (ఆంధ్ర జ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి నిరసనగా మంగళవారం జగిత్యాల బార్ అసోసియేషన్ సభ్యులు విధులు బహిష్క రించి, నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసి యేషన్ అధ్యక్షులు రాచకొండ శ్రీరాములు, మాజీ అధ్యక్షులు డబ్బు లక్ష్మారెడ్డి, ప్రదీప్ కుమా ర్, రాజన్న సంతోష్ కుమార్, కరబూజ నర్సయ్య, అక్బర్, పురుషోత్తం. దిలీప్ మగ్గిడి నర్సయ్య, బిరుదుల లక్ష్మణ్ అనుమండ్ల భీమయ్య పాల్గొన్నారు.

●**కోరుట్ల:** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి ఘటన అమానుషమని కోరుట్ల బార్ అసోసియేషన్ సభ్యులు ఖండించారు. మంగళవారం విధులు బహిష్కరించి కోర్టు భవనం ముందు నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బైరీ విజయ్, సభ్యులు ఫసియొద్దిన్, కడకుంట్ల సదాశివ రాజు, నరేందర్, రాజశేఖర్, మచ్చ వెంకట రమణ మూర్తి, బద్ది నర్సయ్య పాల్గొన్నారు.

●**మెట్‌పల్లిటౌన్:** న్యాయవ్యవస్థని కించపరిస్తే సహిం చేది లేదని మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి అన్నారు. ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం బార్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్య క్షులు తోగిటి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, ఎజిపి అబ్దుల్ హఫీజ్ పాల్గొన్నారు.

●**కథలాపూర్:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నల్ల వర్ధన్ పేర్కొన్నారు.

●**మల్లాపూర్:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి పట్ల మంగళవారం మండల అంబేద్కర్ సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ వెంకట్

శంకరపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నంలో హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్ ఆధ్వర్యంలో మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనాలు తనిఖీ చేసి నంబర్ ప్లేట్ లేని 22 వాహనాలను సీజ్ చేశారు. అనంతరం సీఐ వెంకట్ రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ శేఖర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృత్యువాత


సాగర్ (ఫైల్)

జమ్మికుంట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం శాయంపేట గ్రామానికి చెందిన పంజాల సాగర్ (45) ధర్మారం పరిధిలోని రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. సాగర్ మంగళవారం ఉదయం ఇంటి నుంచి తన ద్విచక్రవాహనంపై కిరాణ సామగ్రి కోసం జమ్మికుంటకు బయలుదేరాడు. ధర్మారం రైల్వే ట్రాక్ దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మల్లయ్య (ఫైల్)

వెల్గటూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రానికి చెందిన బోగ మల్లయ్య (42) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు మల్లయ్య ఈనెల 2న రాత్రి రోడ్డు దాటుతుండగా ధర్మారావుపేటకు చెందిన కొప్పు సాయికుమార్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని అజాగ్రత్తగా నడుపుతూ మల్లయ్యను ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన మల్లయ్య కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

రూ.6,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,400 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 52 మంది రైతులు 319 క్వింటాళ్ల విడి పత్తి, 16 మంది రైతులు 19 క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర రూ.6,400, కనిష్ఠ ధర రూ.3500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న ఇంటర్ విద్యార్థి మొగుళ్ల యశ్వంత్‌ను ఢీకొట్టి ప్రమాదానికి కారణమైన కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన మలావత్ గణేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని మొగుళ్ల యశ్వంత్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడని తెలిపారు. గత నెల 20న రాచర్లగొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట బస్టాండులో దిగి కళాశాలకు రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా తాడ్వాయికి చెందిన గణేశ్ తన బైక్‌తో వెనుక నుంచి ఢీకొట్టాడని చెప్పారు. తీవ్ర గాయాలపాలైన యశ్వంత్‌ను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారని పేర్కొన్నారు. విద్యార్థి సోదరుడు సాయితేజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం..

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ద్వారా నగదు బహుమతులు, స్కాలర్‌షిప్‌లు

జాతీయ డిజిటల్ సైన్స్-2025 టాలెంట్ టెస్ట్‌కు శ్రీకారం





చొప్పదండి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పరిశోధకులుగా, భావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం)ను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. దేశవ్యాప్తంగా విద్యా ర్థులకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించి విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీస్తోంది. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తారు. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక, సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్‌టీ, విజ్ఞాన్ ప్రసార్, విజ్ఞాన భారతి సంస్థలు సంయుక్తంగా ప్రతి సంవ త్సరం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తాయి.

దేశవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఆరు నుంచి 11వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు.. 2025-26 సంవత్స రానికిగాను వీవీఎం దరఖాస్తులను ఆహ్వానిస్తుండగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకు నేందుకు ఈ నెల 30 వరకు గడువు విధించారు.



విద్యార్థి విజ్ఞాన్ మంథన్ లక్ష్యాలు...

సైన్స్‌పై విద్యార్థులకు ఆసక్తి కల్పిస్తూ శాస్త్ర, సాంకేతిక రంగంలో అభివృద్ధి వివరాలను విద్యార్థులకు తెలియజేడయమే లక్ష్యం. ఉన్నతస్థాయి వైజ్ఞానిక విద్యను అభ్యసించేందుకు అవసరమైన మార్గాలను ఏర్పాటు చేస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడం లక్ష్యం. జాతీయస్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు భాస్కర స్కాలర్‌షిప్‌ను కూడా అందజేస్తారు.

పరీక్ష విధానం...

వీవీఎం-2025 పరీక్షలో పాల్గొ నేందుకు దేశ వ్యాప్తంగా ఉన్న సీబీ ఎస్ఈ, ఐసీఎస్ ఈ రాష్ట్ర బోర్డులు అనుమతి పొందిన పాఠశా లల్లో 6, 7, 8 తరగతులు చదివే విద్యార్థులు జూనియర్ విభాగంలో, 9, 10, 11 తరగతులు చదివే విద్యార్థులు సీనియర్ విభాగంలో పరీక్ష రాయాల్సి ఉంటుంది. పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఇంగ్లీష్, హిందీతో పాటు 14 ప్రాంతీయ భాషల్లో పరీక్షను నిర్వహిస్తారు. ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం పొందిన విద్యార్థులను ప్రతి రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. మొదటి బహుమతిగా 25 వేలు, రెండో బహుమతిగా 15 వేలు, మూడో బహుమతిగా 10 వేల రూపాయల చొప్పున అందజేస్తారు. జాతీయస్థాయిలో అదనంగా నాలుగు జోన్ల నుంచి ప్రతి తరగతి నుంచి మొత్తం 18 మందికి ప్రత్యేకంగా నగదు పారితోషకాలు అందజేస్తారు. జాతీయస్థాయిలో బహుమతి సాధించిన విద్యార్థులకు ప్రతినెల రెండు వేల రూపాయల చొప్పున ఏడాదిపాటు భాస్కర స్కాలర్‌షిప్‌ను అందజేస్తారు.

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

వీవీఎం పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు www.vvm.org.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా పేరును నమోదు చేసుకోవాలి. మరింత సమాచారం కోసం వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. విద్యార్థి వ్యక్తిగతంగా లేదా పాఠశాల నుంచి రిజిస్టర్ చేసుకోవాలి. పాఠశాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఎంపిక చేసిన కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహిస్తారు.

కనీసం 50 మంది ఒకే పాఠశాల నుంచి దరఖాస్తు చేసు కుంటే కంప్యూటర్ ఇంటర్‌నెట్ సౌకర్యం ఉన్నట్లయితే అక్కడే పరీక్షా కేంద్రాన్ని కేటాయించే అవకాశం ఉంటుంది. ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలి. పరీక్ష వచ్చే నెలలో ఉండే అవకాశాలు ఉంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 8 గంటల మధ్య ఎప్పుడైనా 90 నిమిషాల పాటు పరీక్ష నిర్వహిస్తారు.

తల్లిని బెదిరించిన కేసులో కొడుకుకు జైలుశిక్ష

పాలకుర్తి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రామారావుపల్లెలో తల్లిని చంపుతానని బెదిరించిన కేసులో కొడుకు జైలుపాలయ్యాడు. ఎస్ఐ స్వామి తెలిపిన వివరాల మేరకు రామారావుపల్లి గ్రామానికి చెందిన సందవేన రమేష్ గతేడాది డిసెంబరులో తండ్రి సందవేన శంకర్‌ను కుటుంబ కలహాలు మనసులో పెట్టుకొని హతమార్చాడు. ఆ కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై తిరిగి వచ్చాడు. కేసు కోర్టులో నడుస్తుండగానే కేసుపెట్టిన తల్లి సందవేన గట్టమ్మను చంపుతానని బెదిరించాడు. దీంతో ఆమె జూన్ 12న బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. కోర్టు కానిస్టేబుల్ ఎన్ రమేష్, లైజెనింగ్ ఆఫీసర్ హెడ్ కానిస్టేబుల్ శంకర్ సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా ఏపీపీ నహేద పర్వీన్ వాదనలు వినిపించారు. మంగళవారం గోదావరిఖని మేజిస్ట్రేట్ దురువ వెంకటేష్ రమేష్‌కు మూడు నెలల 16 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా చేసిన ఎస్ఐ స్వామి, కోర్టు కానిస్టేబుల్ రమేష్‌ను సీఐ, ఏసీపీ అభినందించారు.

వరి పంటపై పందుల దాడి

మల్యాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకపల్లి, రామన్నపేట గ్రామాల పరిధిలో గల వరి పంటను నూకపల్లికి చెందిన కొందరి పందులు ధ్వంసం చేస్తున్నాయంటూ మంగళవారం పలువురు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రతి ఏటా పందుల దాడితో తీవ్రంగా నష్టం పోతున్నామని, రెండు రోజులుగా కూడా పందులు పంటను నష్టపరుస్తున్నాయని రైతులు తెలిపారు. పందుల యజమానుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని, తగు చర్యలు తీసుకోవాలని రైతులు పోలీసులను కోరారు.

దాడికి పాల్పడిన సంఘటనలో ఒకరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమిలో తనకు వాటా ఉందని ఎందుకు దున్నుతున్నారంటూ మహిళపై దాడి చేసిన ఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామానికి చెందిన బాలరాజు నరేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గ్రామంలోని బాలరాజు కావ్య తన భర్త నర్సాగౌడ్‌లు కలిసి ఇటీవల వరి పంటను కోసి గ్రామ శివారులో ఉన్న ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం ఆరబెట్టారని పేర్కొన్నారు. ఈ నెల 7న బాలరాజు నరేశ్ అక్కడకు చేరుకుని వ్యవసాయ భూమిలో తనకు వాటా ఉందని పేర్కొంటూ గొడవకు దిగాడని వివరించారు.

అసభ్యపదజాలంతో దూషించడంతో పాటు బండరాయితో కావ్యపై దాడి చేశాడని పేర్కొన్నారు. అంతటిలో ఆగని నరేశ్ కావ్య భర్త నర్సాగౌడ్ ముఖంపై కొట్టగా గాయమైందని తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు నరేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఏసీబీ వలలో డ్రగ్ కంట్రోలర్ అధికారులు

- రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏడీ, ఇన్‌స్పెక్టర్, సహాయకుడి అరెస్టు - డ్రగ్ కంట్రోల్ కార్యాలయంలో తనిఖీ





ఏసీబీకి చిక్కిన ఏడీ శ్రీనివాసులు, డీఐ కార్తీక్‌రెడ్డి, ప్రైవేట్ ఉద్యోగి రాము, వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో మెడికల్ షాపు నిర్వాహకుడి వద్ద నుంచి లంచం తీసుకున్న కేసులో ఇద్దరు డ్రగ్ కంట్రోలర్ అధికారులతోపాటు ఓ సహాయకుడు మంగళవారం అరెస్ట్ అయ్యారు. కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో డ్రగ్ కంట్రోల్ ఏడీ మర్యాల శ్రీనివాసులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తిక్ భరద్వాజతోపాటు వారికి సహాయకుడిగా పనిచేస్తున్న ఒక ప్రైవేట్ వ్యక్తి పుల్లూరి రామును అరెస్టు చేశారు. డీఎస్పీ వివరాల ప్రకారం.. కరీంనగర్ కోర్టు సమీపంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ మెడికల్ షాపు లైసెన్స్ రెన్యూవల్ చేసేందుకు నిర్వాహకుడిని డ్రగ్ కంట్రోల్ ఏడీ మర్యాల శ్రీనివాసులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తిక్ భరద్వాజరెడ్డి రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫిర్యాదుదారుడి వద్ద నుంచి రూ.20 వేలు తీసుకురావాలని కార్యాలయంలో ప్రైవేట్ సహాయకుడిగా పనిచేస్తున్న రామును సదరు హాస్పిటల్‌కు పంపించారు. మంగళవారం సాయంత్రం ఆస్పత్రి సమీపంలో రోడ్డుపై నిర్వాహకుడి వద్ద నుంచి రాము రూ. 20 వేలు తీసు కుంటుండగా అక్కడే మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం కరీంనగర్ చైతన్యపురిలోని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. పలు మెడికల్ షాపుల లైసెన్స్‌లకు సంబంధించిన ఫైల్స్‌ను, ఇతర రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కార్యాలయంలో ఉన్న డ్రగ్ కంట్రోల్ ఏడీ మర్యాల శ్రీనివాసులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తిక్ భరద్వా జరెడ్డిని అరెస్టు చేశారు. లంచం డబ్బులు సీజ్ చేశామని, ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నామని డీఎస్పీ తెలిపారు. విచారణ అనంతరం ముగ్గురిని బుధవారం కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పర్చనున్నట్లు చెప్పారు.

● లంచం లేనిదే మెడికల్ షాపు లైసెన్స్ రెన్యూవల్ కాదు

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు, మెడికల్‌షాపుల్లో చాలా వరకు ఫార్మసిస్టులు లేకుండానే నడుస్తున్నాయనే ఆరోపణలున్నా యి. జిల్లా వ్యాప్తంగా 400పైగా ప్రైవేట్ ఆస్పత్రులు, 800పైగా మెడికల్ షాపులు నడుస్తున్నట్లు అంచనా. ఈ ఆస్పత్రులు, మెడికల్‌షాపుల్లో ఫార్మాసిస్టుల సర్టిఫికెట్‌తో లైసెన్స్‌లు తీసుకొని ఔషధాలపై పరిజ్ఞానంలేని వారు నడిపిస్తున్నారని, ఇది ప్రమాదకరమని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియంత్రణ చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు నెలనెలా మామూళ్లు ముట్టజెప్పాలని డిమాండ్ చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు కరీంనగర్ డ్రగ్స్ కంట్రోల్ అధికారులపై ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. లంచాల కోసం వేధింపులు భరించలేకనే ఏసీబీని ఆశ్రయించారని సమాచారం.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- బంగారు ఆభరణాలు, నగదు అపహరణ


కిరాణా యజమాని ప్రసాద్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏఎస్సై శ్రీనివాస్

కోరుట్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముత్యాలవాడలో ఉంటున్న చిరుమల్ల రాజగంగా రాం-సరళ దంపతుల ఇంటి తాళం పగులగొట్టిన దొంగలు బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. చిరుమల్ల రాజగంగారాం- సరళ దంపతులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తుండగా కుటుంబంతో కలిసి తిరుపతి దైవదర్శనానికి నాలుగు రోజు క్రితం వెళ్లారు. మంగళవారం రాజగంగారాం ఇంటి తలుపు తెరిచి ఉన్న విషయాన్ని పొరుగింటి వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దొంగతనం విషయం చిరుమల్ల రాజగంగారంనకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. కాగా రాజగంగారం ఇంట్లోని బీరువాలో ఏడు తులాల బంగారం, రెండు కేజీల వెండి, లక్ష రూపాయల నగదు ఉందని తెలిపాడు. కాగా బాధితుడు ఇంటికి తిరిగి వస్తే ఎంత అపహర ణకు గురైందో తెలుస్తుంది. కాగా పోలీసులు కాలనీలో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

కిరాణ షాపులో దొంగతనం..

వెల్గటూర్: మండల కేంద్రంలోని బాలాజీ కిరాణంలో సోమవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు రేణికుంట ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉండడం గమనించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా సీసీ పుటేజీని పరిశీలించారు. అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులు దొంగతనానికి రాగా ఒకరు మాత్రమే లోనికి చొరబడినట్లు నిర్ధారించారు. దుండగుడు 15,000 రూపాయలు అపహరించినట్లు బాధితుడు ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శిథిలావస్థలో విశ్రాంతి భవనం

- 18 ఏళ్లుగా ఆలనాపాలనా కరువు - వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న ప్రజలు


శిథిలావస్థకు చేరిన గంగాధర మండల కేంద్రంలోని గెస్ట్ హౌస్

గంగాధర, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు రెండు కాదు 40 ఏళ్లనాటి పురాతన విశ్రాంతి భవనం. కొన్ని తరాల నుంచి మంత్రులు, పాలకులకు, అధికారులకు ఎందరికో ఆతిథ్యం ఇచ్చిన అలనాటి అద్భుతమైన భవనం నేడు వినియోగంలో లేకపోవడంతో శిథిలమై కనుమరుగవుతోంది. చొప్పదండి నియోజకవర్గంలో గంగాధర సమితిగా ఉన్న సమయంలో ఇక్కడ విశ్రాంతి భవనం నిర్మించాలని ప్రతిపాదించారు. గంగాధర మండల కేంద్రంలో నిర్మించిన గెస్ట్‌హౌస్‌ను 1962లో అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి మర్రి చెన్నారెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులకు సుమారుగా 40 సంవత్సరాలు ఎందరో ప్రముఖులకు ఆతిథ్యమిచ్చింది. 18 సంవత్సరాలుగా ఆలనాపాలనా లేకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. మండల కేంద్రంలో సుమారుగా ఆరు గుంటల విస్తీర్ణంలో స్థలం మధ్యలో నిర్మించిన గెస్ట్ హౌస్ నేడు వెలవెల బోతోంది. ఇక్కడికి అధికారిక కార్యక్రమాలకు వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు వసతులు లేకపోవడంతో కరీంనగర్ వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా గెస్ట్‌హౌస్‌కు మరమ్మతులు చేయించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత అధికారులు, పాలకులపై ఉంది.

ఇంట్లోకి చొరబడి మహిళపై హత్యాయత్నం

- అడ్డువచ్చిన వృద్ధుడిపై దాడి
- పట్టుకొని కట్టేసిన కాలనీవాసులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోకి చొరబడి ఒంటరిగా ఉన్న మహిళ రాపెల్లి గీతపై ఇద్దరు వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. అడ్డు వచ్చిన వృద్ధుడు కోనేటి ఎల్లయ్యపై దాడికి దిగారు. ఓ వ్యక్తి పారిపోగా ఆగ్రహించిన కాలనీవాసులు సిరిసిల్ల పట్టణానికి చెందిన వ్యక్తి మల్లేశంను పట్టుకుని తాడుతో కట్టేసి చితకబాదారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, బాధితురాలి కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేటలో గీత తన భర్త కృష్ణకాంత్‌తో కలిసి జీవిస్తోంది. ఆమెకు తన తండ్రి నుంచి వచ్చిన ఆస్తిని పేరు మార్పిడి కోసం కుటుంబ, నివాస ధ్రువీకరణ పత్రం అవసరమైంది. దాంతో గీత భర్త కృష్ణకాంత్ సిరిసిల్లలో పనిచేస్తున్న చోట పరిచయమున్న ఇద్దరు వ్యక్తులు మల్లేశం, గణేశ్‌లకు విషయం చెప్పాడు. తమకు పరిచయమున్న సిరిసిల్లలోని మాసాల గణేశ్ ధ్రువీకరణ పత్రాలు ఇప్పిస్తాడని అందుకు రూ.30 వేలు డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కృష్ణకాంత్ రూ.30 వేలు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. మాసాల గణేశ్‌కు రెండు విడతల్లో రూ.7,500 వేలు ఆన్‌లైన్ ద్వారా పంపించాడు. తమకు డబ్బులు ఇవ్వాలని మల్లేశం, గణేశ్‌లు కృష్ణకాంత్‌ను ఒత్తిడి చేశారు. మల్లేశం, గణేశ్‌లు ఎల్లారెడ్డిపేటలోని మహిళ గీత ఇంటిలోనికి చొరబడి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆమె కేకలు వేయడంతో మల్లేశం ఆమెపై ముసుగు వేయగా గణేశ్ గొంతు నొక్కేందుకు సిద్ధమయ్యాడు. అరుపులు విన్న వృద్ధుడు కోనేటి ఎల్లయ్య, అతని కొడుకు ఆంజనేయులు చేరుకుని అడ్డుకునే ప్రయత్నం చేశారు. గణేశ్ అక్కడ నుంచి తప్పించుకున్నాడు. మల్లేశం పారిపోతున్న క్రమంలో పట్టుకునేందుకు ఎల్లయ్య యత్నించడంతో కర్రతో దాడి చేయడం వల్ల తలకు బలమైన గాయమైంది. కాలనీవాసులు అప్రమత్తమై మల్లేశంను పట్టుకుని కట్టేసి చితకబాదారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మల్లేశంను అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. బాధితురాలు గీత ఫిర్యాదు మేరకు మల్లేశం, గణేశ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాహుల్‌రెడ్డి తెలిపారు.




నిందితుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు, గాయపడిన వృద్ధుడు ఎల్లయ్య

ఇద్దరి బైండోవర్

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అటవీ భూముల్లోకి ప్రవేశించి చెట్లను తొలగించడంతో పాటు చదును చేసిన సంఘటనలో కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు హీరామండి, పాపియను తహసీల్దార్ ముక్తర్‌పాషా ఎదుట హాజ రు పరిచామని ఎస్ఐ లక్ష్మణ్ మంగళవారం తెలిపారు. వీర్నపల్లి మండలం శాంతినగర్ శివారులోని అటవీ భూములను హీరామండి, పాపియ చదును చేసేందుకు వచ్చారని పేర్కొన్నారు. ముందస్తు చర్యలో భాగంగా తహసీల్దార్ ముక్తర్ పాషా ఎదుట బైండోవర్ చేశామని ఎస్ఐ లక్ష్మణ్ వివరించారు.

రూ. 80 వేలు సీజ్

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో కాల్వశ్రీరాంపూర్ మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐ వెంకటేష్ ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కాల్వశ్రీరాంపూర్ చెందిన ఆరే మల్లారెడ్డిని తనిఖీ చేయగా రూ.80 వేల నగదు లభించింది. దీంతో అతని నుంచి వివరాలు సేకరించగా సరైన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేత్రదానం

శంకరపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన కటికరెడ్డి సుమంత్ (నరేష్‌రెడ్డి) గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కాగా కుటుంబ సభ్యుల అంగీకారంతో ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి వారు నేత్రాలు సేకరించారు. పుట్టెడు దుఃఖంలో నేత్రదానానికి అంగీకరించిన కుటుంబసభ్యులను గ్రామస్థులు అభినందించారు.

యోగా పోటీల్లో పతకాలు సాధించాలి


యోగా పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి యోగాసన పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో జిల్లా నుంచి రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులను సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా యోగా క్రీడాకారులు ఈ నెల 9 నుంచి 12 వరకు మైసూర్‌లో జరగనున్న 50వ సీనియర్స్ జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. జాతీయస్థాయి పోటీలకు పురుషుల విభాగంలో పి స్వరూపచారి, ఎల్ కోటేశ్వర్‌రావు, మహిళల విభాగంలో జె ఆమని, పి సుగుణ, బి ప్రవళిక ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, యోగా కోచ్‌లు వి కిష్టయ్య, జి రామకృష్ణ, పి మల్లేశ్వరి పాల్గొన్నారు.


జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

జాతీయ యోగా పోటీలకు ఎంపిక

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలో మైసూర్‌లో జరగనున్న 50వ జాతీయ యోగా పోటీలకు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లాకు చెందిన సీనియర్ క్రీడాకారులు పసుపుల ప్రణయ్, గోక వినోద్‌కుమార్, ఓరగంటి రామకృష్ణ జాతీయ యోగ సీనియర్ విభాగం పోటీలకు ఎంపికావడంతో మంగళవారం జిల్లా కేంద్రంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, యోగ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్, యోగ సాధకులు అశోక్, లావణ్య, దేవయ్య, కనకయ్య, శ్రీదేవి, తిరుపతి అభినందించారు. ఈ నెల 8 నుండి 15వ తేది వరకు మైసూర్‌లో జరిగే 50 జాతీయ యోగ పోటీలకు జిల్లా క్రీడా కారులు పసుపుల ప్రణయ్, గోక వినోద్‌కుమార్, ఓరగంటి రామకృష్ణ తరలివెళ్లారు.

వైభవంగా కోజాగరి పౌర్ణమి వ్రతపూజ

పాలల్లో చంద్రుడిని దర్శించుకున్న భక్తులు



రాజన్న ఆలయంలో కోజాగరి వ్రతపూజకు హాజరైన భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం రాత్రి కోజాగరి పౌర్ణమి వ్రతపూజను అర్చకులు వైభవంగా చేపట్టారు. ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి సందర్భంగా రాజన్న ఆలయంలో రాత్రి 12 గంటల వరకు కోజాగరి (మహాలక్ష్మీ, క్షీరచంద్ర) పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పాలలో చంద్రుడిని దర్శించుకున్నారు. కోజాగరి పూర్ణిమ వ్రతం రోజున పాలలో చంద్రుడిని దర్శించుకుంటే జన్మ ధన్యమవుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

రేవతి నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఆలయ అర్చకులు మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ పార్వతిరాజరాజేశ్వర స్వామివారలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పరివార దేవతార్చనలు నిర్వహించగా శ్రీ అనంతపద్మ నాభ స్వామి వారికి పంచోపనిషత్ ద్వారా అభిషేకం చేపట్టారు.





పాలల్లో చంద్రుడిని దర్శించుకుంటున్న భక్తులు, అర్చకులు

ప్రణాళిక ప్రకారం విస్తరణ పనులు పూర్తి చేయాలి

- రాజన్న సిరిసిల్ల కలెక్టర్ ఎం. హరిత
- రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధిపై అధికారులతో సమీక్ష
- భీమేశ్వర ఆలయంలో అభివృద్ధి పనుల పరిశీలన

వేములవాడ కల్చరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. హరిత ఆదేశించారు. రాజన్న, భీమేశ్వర ఆలయంలో జరుగుతున్న అభిషేకం, అన్నపూజ, కోడె క్యూలైన్ కౌంటర్స్ ప్రసాదం తయారీ విభాగం, నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం మండపాల పనులను మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆలయ అతిథి గృహంలో వీటీడీఏ, ఆలయ అధికారులు, అర్చకులు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ అభివృద్ధిపై రూపొందించిన నమూనాను కలెక్టర్‌కు క్షేత్ర ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి వివరించారు. ప్రస్తుతం భవనాల కూల్చివేత పనులు, ప్రణాళిక ప్రకారం చేపడుతున్న చర్యలపై ఆరాతీశారు.



భీమేశ్వర ఆలయంలో చేపడుతున్న పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిత

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్వామి వారి దేవస్థానానికి వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు, మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. ఆలయ విస్తరణకు పెండింగ్ పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రోజువారీగా చేపట్టే పనుల వివరాలు ఇవ్వాలని సూచించారు. నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. వచ్చే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ముందు వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఇబ్బందులు తలెత్తకుండా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సంబంధిత ఉద్యోగులను ఆదేశించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ సీఈ రాజేశ్వర్‌రెడ్డి, ఆలయ ఈవో రమాదేవి, క్షేత్ర ఆర్కిటెక్ట్ సూర్య సత్యనారాయణ మూర్తి, అధికారులు నరసింహచారి, అన్వేష్, విజయప్రకాశ్‌రావు, అన్సార్ ఉన్నారు.

'నవోదయ' దరఖాస్తు గడువు పొడిగింపు

చొప్పదండి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానికిగాను 9, 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే గడువు పొడిగించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 వరకు గడువు ఉందని, ప్రస్తుత విద్యాసంవత్సరంలో 8, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్సారెస్పీకి 1,51,480 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ 37 గేట్లు ఎత్తి 1,51,480 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో కాకతీయ కాలువకు 4,000, సరస్వతీ కాలువకు 650, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవం



రథంపై కొలువుదీరిన శ్రీవారు



స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

- భక్తులకు రథంపై దర్శనమిచ్చిన గోవిందుడు
- స్వామి వారిని దర్శించుకున్న విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కేటీఆర్



శ్రీవారి రథోత్సవంలో పాల్గొన్న ప్రజలు

సిరిసిల్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తుల జయజయధ్వానాలతో 30 అడుగుల ఎత్తుతో ఉన్న రథంలో స్వామివారిని సిరిసిల్ల పట్టణంలో ఊరేగించారు. రథయాత్రను చూడడానికి సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి జిల్లాలతో పాటు మహా రాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులు రథాన్ని లాగుతూ తమ భక్తిని చాటుకున్నారు. ప్రతియేటా శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవోపేతంగా జరుగుతాయి.

మహారథంపై శ్రీస్వామి వారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పంటలతో రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం దేవాలయం సిబ్బంది, అర్చకులు ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెల్ముల స్వరూప తిరుపతిరెడ్డి, సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, టీపీసీసీ కో ఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, కాంగ్రెస్ జిల్లా మహిళ అధ్యక్షురాలు కాముని వనిత, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు. రథోత్సవాన్ని సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ముందుగా స్వామి వారిని దర్శించుకొని కేటీఆర్ పూజలు నిర్వహించారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, పట్టణ మహిళ విభాగం అధ్యక్షురాలు బత్తుల వనజ, మాజీ కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు. వెంకటేశ్వర స్వామిని జిల్లా జడ్జి డి నీరజ, ఎస్పీ మహేష్ బీ. గితే వేర్వేరుగా దర్శించుకున్నారు. రథోత్సవానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక పెద్ద బజారు, గాంధీచౌక్, అంబేద్కర్ నగర్ నుంచి వాహనాలు రాకుండా పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనం రద్దు చేయడంతో భక్తులు మండిపడ్డారు.

వరద ప్రదాయిని

- వరద కాలువ నీటితో జోరుగా పంటల సాగు
- సాగులోకి బీడు భూములు..



వరదకాలువ

మల్యాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రవహించే వరద కాలువ రైతులకు వరప్రదాయినిగా మారింది. ఒకప్పుడు నీటి సౌకర్యం అంతంతమాత్రమే అందుబాటులో ఉండడంతో రైతాంగం సాగు నీటి కోసం అనేక ఇబ్బందులు పడగా ప్రస్తుతం వరద కాలువతో సాగు విస్తీర్ణం పెరిగింది. పదేళ్ల క్రితం అందుబాటులోకి వచ్చిన వరద కాలువ మండలంలో దాదాపుగా 15 కి.మీ.ల మేర ప్రవహిస్తుండగా ఆ నీటితో చెరువులు, కుంటల్లో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో ఒక్క మల్యాల మండలంలోనే గతంలో కంటే దాదాపు 5వేల ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం పెరిగినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

గతంలో వానాకాలం పంటలను కొంత మేరే సాగు చేయగా ఇప్పుడు రెండు సీజన్లలో పంటలు సాగు అవుతున్నాయి. మెట్ట ప్రాంతమైన మల్యాల మండలంలోని రైతులు వ్యవసాయ బావులపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. మండలంలో వరద కాలువ రాక ముందు సుమారు 9వేల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా ఇప్పుడు 14వేల ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగింది. వరితో పాటు మొక్కజొన్న, పత్తి, పసుపు తదితర పంటలు సాగవుతున్నాయి. మల్యాల మండలంలోని సర్వాపూర్, ముత్యంపేట, మల్యాల, నూకపెల్లి, రామన్నపేట, గొల్లపల్లె, రాంపూర్ గ్రామాల పరిధిలో వరద కాలువలో నిరంతరం నీరు ఉంటుండడంతో కాలువ వెంబడి గల ఉన్న వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు పెరిగాయి. వరద కాలువ నీటితో తాటిపెల్లి పెద్ద చెరువు, పోతారంలోని చెరువును నింపుతున్నారు. దీంతో ఆయా చెరువుల కింద వందలాది ఎకరాల్లో రైతులు పంటల సాగు చేస్తున్నారు. వందలాది మంది ఓగులాపూర్, మద్దుట్ల, మల్యాల, ముత్యంపేట, సర్వాపూర్, బల్వంతాపూర్‌కు చెందిన రైతులు వరద కాలువ నుంచి వ్యవసాయ పొలాలకు కిలోమీటర్ల మేర పైపులైన్లు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఈ ప్రాంతంలో సాగు విస్తీర్ణం పెరిగి వరద కాలువ వరప్రదాయినిగా మారిందని పేర్కొంటున్నారు.

వరద కాలువపై పంప్‌హౌస్

మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో వరద కాలువ 73 కి.మీ వద్ద పంప్‌హౌస్ నిర్మాణం కూడా రైతులకు వరంగా మారినట్లు అయింది. ఎత్తి పోతలు లేని సమయంలో గేట్లు మూసి ఉండడంతో కాలువలో నీరు నిరంతరం నిలిచి ఉంటుంది. దీనికి తోడు నూకపల్లి శివారులో గల వరద కాలువ 77 కి.మీ వద్ద క్రాస్ రెగ్యులేటర్ నిర్మాణంతో నాలుగు కిలోమీటర్ల మేర కాలువలో నీరు నిలిచి నూకపల్లి, రామన్నపేట, మద్దుట్ల, గొల్లపల్లె గ్రామాల రైతులకు నీరు ఎల్లవేళలా అందుబాటులో ఉంటుంది. దీంతో మల్యాల మండల వ్యాప్తంగా వరద కాలువతో సాగు, తాగునీరుకు ఢోకా లేకుండా పోయింది.



పెరిగిన వరి సాగు

రాంచందర్‌రెడ్డి, రైతు, ముత్యంపేట



వరద కాలువ నీటితో భూగర్భ జలాలు పెరిగాయి. వరద కాలువతో యేటా రెండు పంటలు వరి సాగు చేస్తున్నాం. గతంలో ఈ ప్రాంతంలో సాగు నీటికి అనేక ఇబ్బందులు పడగా ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. వరద కాలువపై నిర్మించిన పంప్‌హౌస్‌లతో నీరు ఎల్లప్పుడూ కాలువలో నిలిచి ఉండడంతో రైతులకు ఎంతో ప్రయోజనకరంగా మారింది.

శివ పార్వతుల కల్యాణం

తంగళ్లపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శ్రీ శివలింగ భక్త మార్కండేయ దేవాలయంలో శివ పార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. మంగళవారం పురోహితుల వేద మంత్రాలు భక్తుల శివనామస్మరణతో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పద్మశాలి సంఘం అధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

శివకేశవుల రథోత్సవం

ముస్తాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని శ్రీశివకేశవుల ఆలయంలో రథోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ మిరుదొడ్డి శరయ్య ఆధ్వర్యంలో వేద పండితులు హరీశ్‌శర్మ తదితరుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివపార్వతులు, లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను వేరువేరు రథాలపై పుర వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళహారతుల నడుమ ప్రత్యేక అలంకరణలు, ఏర్పాట్లు, దాండియా ఆటల మధ్య శివకేశవుల రథోత్సవం కోలా హలంగా సాగింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఒరగంటి తిరుపతి, ఆగుళ్ల రాజేశం, బండి ఎల్లం, దొరగొల్ల బాలయ్య, సంతోష్ రావు, రాంచంద్రం, బండారి సత్తయ్య, తాళ్ల రాజు, కోడె శ్రీనివాస్, జనగామ శ్రీనివాస్, పర్శ తిరుపతి, భక్తులు, పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

గంబీరావుపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీతారాం బజార్‌లో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం మంగళవారం కన్నుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య అత్యంత వైభవంగా కల్యాణం సాగింది. నాఫ్స్‌కాబ్ చైర్మెన్ కొండూరు రవీందర్‌రావుతో పాటు పెద్ద ఎత్తున ప్రజలు, పలువురు నాయకులు కల్యాణం తిలకించి స్వామి వారిని దర్శించుకున్నారు.

పెన్షనర్ల బకాయిలు ఇచ్చే వరకు ఆందోళన

రేవా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి

సుభాష్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు ఇచ్చే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని రేవా(రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి అన్నారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రధానకార్యదర్శి సుంకిశాల ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఏడాదిన్నరగా ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యూటీ అందలేదన్నారు. ఉద్యోగ విరమణ పొందిన తరువాత వెంటనే రావాల్సిన బకాయిలు అందక పెన్షనర్స్ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఉండేది కాదన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న కోహెడ చంద్రమౌళి

ఈ విషయమై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతోందని, అందుకే ధర్నా చేపట్టాల్సి వచ్చిందని అన్నారు. ఉపాధ్యక్షులు గద్దె జగదీశ్వరచారి, ఎం. భారతి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ బకాయిలు వచ్చే వరకు పోరాటం చేస్తామని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని అన్నారు. బకాయిలు రాక పిల్లల పెళ్లిల్లు చేయలేక పోతున్నామని, ఇల్లు కట్టుకోలేకపోతున్నామని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రయోజనాలు ఇవ్వాలని, లేని పక్షంలో ఆరమణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కోశాధికారి కనపర్తి దివాకర్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మేందర్, ప్రధాన కార్యదర్శి కె.భోగేశ్వర్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె. దేవదాసు, సిద్దిపేట జిల్లా బాధ్యుడు కిషన్ నాయక్, రాములు, జగిత్యాల జిల్లా బాధ్యుడు ఎం.రామిరెడ్డి, సిరిసిల్ల జిల్లా బాధ్యుడు మల్లారపు పురుషోత్తం, పెద్దపల్లి జిల్లా బాధ్యుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామిని మంగళవారం వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. వేకువజాము నుంచే తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఆలయంలో స్వామి వారికి మొక్కులు చెల్లించుకొని బేతాళుడు, రాముల వారి వద్ద పూజలు చేశారు.



కొండగట్టులో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

కొండగట్టులో గిరిప్రదక్షిణ

కొండగట్టు అంజనేయస్వామి గిరుల చుట్టూ మంగళవారం గిరిప్రదక్షిణ నిర్వహించారు. హైదరాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయంలోని శివాలయం ప్రధాన అర్చకులు సురేశ్ ఆత్మారాం మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గిరిప్రదక్షిణకు వచ్చిన భక్తులు దిగువ కొండగట్టులో పూజలు నిర్వహించి ప్రదిక్షణ ప్రారంభించారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

- జాతీయస్థాయి ఫారెస్ట్ క్రీడల్లో పతకాలు సాధించాలి
- చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రియాంకవర్గీస్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రియాంకవర్గీస్ అన్నారు. కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాల మైదానంలో మంగళవారం రీజినల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌ను ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు మైదానంలో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. ఇలాంటి క్రీడలు ఉద్యోగులకు ఆటవిడుపుగా పని చేస్తాయని, తిరిగి విధుల్లో పూర్తి సామర్థ్యంతో పనిచేసేందుకు ఉపయోగపడతాయన్నారు. క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని, జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అంతకు ముందు కరీంనగర్, కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల నుంచి హాజరైన క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్‌తో అతిథులకు క్రీడా వందనం సమర్పించారు. వాలీబాల్, క్రికెట్, అథ్లెటిక్స్, చెస్, క్యారమ్ తదితర క్రీడలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో కరీంనగర్ ఎఫ్ఆర్‌వో బాలమని, మెదక్ ఎఫ్ఆర్‌వో జోజి, ఇతర జిల్లాల ఎఫ్ఆర్‌వోలు, డీవైఎస్‌వో వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రియాంకవర్గీస్

వర్షాలకు నేలవాలిన వరి పంట

అన్నదాతలకు ఆర్థిక భారం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): వరి పంట చేతికందే సమయంలో కురిసిన వర్షాలకు పైరు నేలవాలడంతో కోతకు అన్నదాతలకు తంటాలు పడుతున్నారు. పొలంలో వర్షపు నీరు నిలిచి యంత్రాలు దిగబడడం వల్ల కోతకు వీలు లేకుండా ఉన్నది. దీంతో గత్యంతరం లేక కూలీలతో కోయాల్సిన దుస్థితి దాపురిస్తోంది. కోసిన పంట తడిసిపోవడం వల్ల ఆరబెట్టడం మరో ప్రయాసగా మారింది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్, బండలింగంపల్లి, హరిదాస్‌నగర్, పదిర తదితర గ్రామాల్లో సాగు చేసిన వరి పంటకు కోత దశకు చేరుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వరి పైరు నేలవాలిపోయింది. కోయకపోతే ఉన్న పంట పొలంలోనే మొలక వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. యంత్రాలు బురదలో దిగబడి పోవడంతో రైతులు కూలీలతో కోయించి ఆరబెట్టేందుకు అవస్థలు పడుతున్నారు. యంత్రాలకు గంటకు సుమారు రూ.3 వేలు చెల్లించాల్సిన ధర వర్షంతో నేలవాలిన పైరుకు సుమారు రూ. 9 వేలు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. యంత్రాలు దిగబడడం వల్ల మిగిలిన వరి పంటను కోసేందుకు ఒక్కో కూలీకి రూ.600 వెచ్చిస్తున్నామని చెబుతున్నారు.



నేలవాలిన వరి పంట

ఆరు లక్షల పెట్టుబడి పెట్టా..

మేడిశెట్టి వజ్రవ్వ, వెంకటాపూర్



మాకున్న నాలుగెకరాలతో పాటు మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి పంటను సాగు చేశా. సాగుకు మొత్తం రూ. 6 లక్షల పెట్టుబడి పెట్టా. పంట కోత దశకు వచ్చిన సమయంలో గాలివానకు ఐదు ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. పొలం వాన నీళ్ల ఉండడంతో వరి కోత యంత్రం దిగబడింది. కూలీలను పెట్టి కోయిస్తున్నా.



తడిసిన వరిని ఆరబెడుతున్న రైతు

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 7 : వరి పంటల్లో కాటుక తెగుళ్లు, కంకినల్లి వ్యాపించినందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి దీపిక సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దాపూర్ గ్రామంలోని వరి క్షేత్రాలను పొలాస శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులతో వరికి కాటుక తెగుళ్లు, కంకినల్లి వ్యాపించినట్లు గుర్తించారు. కంకి నల్లి నివారణకు 1 మీ.లీ స్పైరొమెసిఫీన్, కాటుక తెగులు నివారణకు 1 మీ.లీ ప్రొపైకానాజోల్‌ను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నరేష్, శాస్త్రవేత్తలు స్వాతి, మధుకర్, రైతులు దొతుల రమేష్, మిట్టపల్లి నారాయణరెడ్డి, జీవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపికపై సర్వే

కథలాపూర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక కోసం గ్రామాల్లో సర్వే చేసి జాబితాను వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు పంపించామని పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అజీం తెలిపారు. 13 ఎంపీటీసీ స్థానాలకుగాను గ్రామాల్లో మంగళవారం తిరిగి ఆశావాహుల నుంచి పూర్తిస్థాయి వివరాలు సేకరించి జాబితా పంపించామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ వాకిటి రాజరెడ్డి, మాజీ సర్పంచ్ గడ్డం స్వామిరెడ్డి, తలారి మోహన్, గడ్డం చిన్నారెడ్డి, వర్థినేని లింగారావు ఉన్నారు.

పూర్వ విద్యార్థులకు సన్మానం

రాయికల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని వివేకవర్ధిని పాఠశాల పూర్వ విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా ఆర్మూర్ శివ కుమార్, జగిత్యాల టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా అనుపురం శ్రీకర్ ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులను మంగళవారం పాఠశాల కరస్పాండెంట్ ఖైరం సత్యం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూమేశ్వర్, ఉపేందర్, కుందారపు శ్రీనివాస్, మోర విజయ్, వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక

కోరుట్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గౌతమ్ మోడల్‌స్కూల్ విద్యార్థులు స్కూల్ గేమ్ ఫెడరేషన్‌లో రాణించి జిల్లా క్రీడలకు ఎంపికయినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జైనాపురం ప్రవీణ్ కుమార్ మంగళవారం తెలిపారు. ఖోఖోలో రిత్విశ్రీ, వాలిబాల్‌లో మణిచరణ్, హేమంత్, కబడ్డిలో హేమంత్, మధుశ్రీ అక్షయ్‌లు జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక యినట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను డీన్ రాందాస్, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యా యుడు ప్రవీణ్ అభినందించారు.

మంత్రి అడ్లూరిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసన

-ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మ దహనం

జగిత్యాల అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వాఖ్యలకు నిరసనగా మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను ఎమ్మార్పీఎస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లో సోమవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో పొన్నం ప్రభాకర్ మాదిగల ఆత్మ గౌరవాన్ని కించపరిచే విధంగా సహచర మంత్రి అన్న గౌరవం కూడా లేకుండా కించపరచడాన్ని ఖండిస్తున్నామన్నారు. లక్ష్మణ్ కుమార్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పనట్లయితే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సురుగు శ్రీనివాస్, డూమాల గంగారాం, బెజ్జంకి సతీష్, చెట్‌పెల్లి లక్ష్మణ్, నక్క సతీష్, తదితరులు పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను మంగళవారం మాదిగ సంఘం నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రాజశేఖర్, చిట్యాల రాజు, తాళ్లపల్లి మహేష్, తెడ్డు రాజాం, శనిగారపు భరత్, వెంకయ్య, రాందాస్, రూపేష్ పాల్గొన్నారు.

●**ధర్మపురి:** మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు దళిత సంఘాల ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని వెంటనే పొన్నం ప్రభాకర్‌ను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మొలుగూరి రమేష్, బొల్లారపు పోచయ్య, చందోళి శ్రీనివాస్, రాయిల్ల రవికుమార్, కట్ట లక్ష్మణ్, జంజిరికాని భరత్, దాసరి పురుషోత్తం, బత్తిని నరేష్, నవీన్, ప్రశాంత్, మల్లిక్, రోషి, గణేష్, సత్తయ్య, నరేష్, గంగాధర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.




జగిత్యాల, ధర్మపురిలో మంత్రి పొన్నం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

'మంత్రి అడ్లూరిపై పొన్నం వ్యాఖ్యలు సిగ్గుచేటు'

ధర్మపురి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై సహచర మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు సిగ్గు చేటని టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని పీఎస్‌కే ఏసీ మినీ ఫంక్షన్ హాల్‌లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్‌తో కలిసి మంగళవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడడాన్ని ఆయన ఖండించారు. సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ నర్సింహులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

●**గొల్లపల్లి:** మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పై సహచర మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన అనుచిత వ్యాఖ్యల్ని బేషరతుగా వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్ డిమాండ్ చేశారు. మంగళవారం గొల్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సమావేశాల్లో ఏఎంసీ చైర్మన్ సంతోష్, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు గంగాధర్, సత్యానారాయణ గౌడ్, వెంకటేష్, వెంకటేష్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

●**వెల్గటూర్:** మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన అనుచిత వాఖ్యలపై క్షమాపణ చెప్పాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వెల్గటూర్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మెరుగు మురళి గౌడ్, శ్రీకాంత్‌రావు, సందీప్‌రెడ్డి, మంజుల, రంగు తిరుపతి, ఉదయ్, నరేష్ గౌడ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** మంత్రి లక్ష్మణ్ కుమార్‌ను ఉద్దేశించి మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మార్కెట్ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు సంధి మల్లారెడ్డి, తడగొండ రాజు, నాయకులు విజయ భాస్కర్, తిరుపతి, కిషన్, మల్లేశం, విష్ణు, వంశీదర్ రావు, పవన్ రెడ్డి, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాకు మరో మణిహారం

(5వ పేజీ తరువాయి)

గ్రంథాలయం, వైద్యం, క్యాంటీన్, క్రీడా సౌకర్యాలు ఉంటాయి. ప్రయోగాత్మక అభ్యసన అనుభవాలను విద్యార్థులకు అందించేందుకు సైన్స్ కంప్యూటర్, లాంగ్వేజ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తారు. గ్రంథాలయంలో కేంద్రీయ విద్యాలయ పుస్తకాలు, మ్యాగజైన్లు, వార్తా పత్రికలు, ఇతర రీడింగ్ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుతారు. విద్యార్థులకు విశాలమైన క్రీడా మైదానాలను ఏర్పాటు చేసి క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, వాలీబాల్ వంటి క్రీడల కోసం పరికరాలను అందుబాటులో ఉంచుతారు. విద్యార్థులకు అవసరమైనప్పుడు వైద్య సహాయం అందించేందుకు వైద్య సిబ్బందిని నియమించి పాఠశాలలో క్లినిక్‌ను ఏర్పాటు చేస్తారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తారు.

● ఎడ్యుకేషన్ హబ్‌గా జిల్లా

జిల్లాకు గత యేడాది మంజూరు అయిన నవోదయ విద్యాలయాన్ని కోరుట్లలో ఏర్పాటు చేశారు. నవోదయ విద్యాలయంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 40 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. కోరుట్ల పట్టణంలోని వేములవాడ రోడ్‌లో గల వసతిగృహంతో పాటు గతంలో కొనసాగిన అగ్రికల్చర్ బీఎస్సీ కళాశాల భవనంలో నవోదయ విద్యాలయం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మంజూరు అయిన కేంద్రీయ విద్యాలయాన్ని జిల్లా కేంద్రం శివారులోని చల్‌గల్ వాలంతరీ వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేయనున్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రవేశాలు నిర్వహించడానికి అనుగుణంగా అధికారులు కసరత్తులు చేస్తున్నారు. కొడిమ్యాల మండలం నాచుపల్లిలో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల, కోరుట్లలో పశు వైద్య కళాశాల, జగిత్యాల మండలం పొలాసలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆవరణలో వ్యవసాయ డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ కళాశాల, జగిత్యాల మండలం నూకపల్లి వద్ద అడ్వాన్స్ టెక్నాలజీ ట్రేనింగ్ సెంటర్, జగిత్యాలలో మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలలు పని చేస్తున్నాయి. వీటికి తోడు నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మంజూరయ్యాయి.

వైభవంగా గిరి ప్రదక్షిణ



కిషన్‌రావుపేటలో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వెల్గటూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిషన్‌రావుపేట శ్రీ నాగపల్లి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి చిత్ర పటాన్ని అందంగా అలంకరించి శావపై నిలిపి వైభవంగా గిరి ప్రదక్షిణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలని పిటిషన్

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కాంగ్రెస్ నాయకుడు కొమిరెడ్డి విజయ్ అజాద్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయడాన్ని సమర్థిస్తు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు.

మెడికల్ విద్యార్థికి సన్మానం

కోరుట్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో చదివిన తాండ్ర శ్రవణ్ సాయి హైదరాబాద్‌లోని మెడికల్ కాలేజీలో సీటు సాధించడంతో మంగళవారం పాఠశాల వ్యవస్థాపకుడు తుమ్మనపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థిని సన్మానం చేశారు. కార్యక్రమంలో కరస్పాడెంట్ తుమ్మనపల్లి మనోజ్ కుమార్, ప్రిన్సిపల్ సిరికొండ గంగాధర్ పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

మల్లాపూర్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి)7 : ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించాలని మల్లాపూర్ బీఆర్ఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు తోట శ్రీనివాస్, మల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి

జగిత్యాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో విద్యార్థులు రాణించి, దక్షిణ భారత స్థాయి పోటీలకు అర్హత సాధించేలా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాము అన్నారు. మంగళవారం పట్టణంలోని టీచర్స్ భవనంలో మానవ జాతి ప్రయోజనం కోసం శాస్త్ర సాంకేతికత ప్రధాన అంశంగా నిర్వహించిన సైన్స్ డ్రామా పోటీలు అలరించాయి. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. జగిత్యాల జిల్లా పోటీల విజేతగా కెజిఆర్ స్కూల్‌కు చెందిన పది మంది విద్యార్థుల బృందం మొదటి స్థానంలో నిలిచింది. ఈ నెల 17,18వ తేదీలలో ఎస్‌ఇఆర్‌టిలో జరుగు రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా పోటీలకు ఎంపికయ్యారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా విద్యాధికారి రాము అభినందించి రాష్ట్ర స్థాయి పోటీలలో గెలుపొంది దక్షిణ భారత సైన్స్ డ్రామా పోటీలకు అర్హత సాధించేలా కృషి చేయాలని విద్యార్థులను ప్రోత్సహిం చారు. రెండవ స్థానంలో జిల్లా పరిషత్ పాఠశాల కల్లెడ విద్యార్థులు నిలిచారని జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ తెలిపారు.



ప్రశంసపత్రాలు అందుకున్న విద్యార్థులతో డీఈవో రాము

టెక్నాలజీతో విప్లవాత్మక మార్పు

జగిత్యాల, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రయోగశాలలు, టెక్నాలజీతో తరగతి గదులలో విప్లవాత్మక మార్పు చోటుచేసు కుంటుందని జగిత్యాల జిల్లా విద్యాశాఖ అధికారి రాము అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రియాలిటీ టెక్నాలజీ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని జగిత్యాల పిఎంశ్రీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కోరుట్ల తెలంగాణ మోడల్ స్కూల్, మగ్గిడి, ధర్మపురి పాఠశాలలకు ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ టెక్నాలజీ సైన్స్ ల్యాబ్‌లను మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ చాంద్, ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

కథలాపూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని గంభీర్‌పూర్‌లో మంగళవారం వేంకటేశ్వరస్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం పూట స్వామి వారలు ఆసీనులైన రథంను పురవీధుల వెంట ఊరేగించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పండితులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా గాయత్రి యజ్ఞం

ధర్మపురి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తీగలధర్మారం గ్రామంలో గల శ్రీ కృష్ణ గీతాశ్రమంలో మంగళవారం ఘనంగా గాయత్రి యజ్ఞం నిర్వహించారు. పౌర్ణమి పురస్కరించుకుని ఉదయం వేళలో శ్రీ కృష్ణ అభిషేకం, గోపూజ, తులసి పూజ, పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

అనేక మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ కృష్ణ గీతా ఆశ్రమ అధ్యక్షులు వేముల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ జంగిలి ప్రభాకర్, గందం రమేష్, వేములు మల్లేశం, సురేందర్, జీవన్‌రెడ్డి, గుర్రం రామన్న, మల్లారెడ్డి, జ్యోతి, లక్ష్మిభవాని, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఆనందరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహిస్తున్న ఏబిఆర్ఎస్ఎం జాతీయ సమావేశాల్లో రాష్ట్ర పీఆర్‌టీయూ నాయకులు జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ లాల్ గుప్తాలకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పాలేటి వెంకట్రావు, డాక్టర్ సూరం విష్ణువర్ధన్‌రెడ్డి, అయిల్నేని నరేందర్‌రావు, పాపిరెడ్డి, పెంటయ్య, రామకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పదవీ విరమణ పొందిన జగిత్యాల జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు అయిల్నేని ఆనందరావును జైపూర్‌లో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు నవ్వాత్ సురేష్, కార్యదర్శి హనుమంత రావు, నవాజ్ సురేష్, వి. రాజశేఖర్, ఎలిగేటి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ధర్మపురిలో చాగంటి పర్యటన

-ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి అడ్లూరి

ధర్మపురి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర్‌రావు ఈ నెల 11, 12 తేదీల్లో పర్యటించనున్నారు. ఈనేపథ్యంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళ వారం సాయంత్రం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ధర్మపురిలోని శ్రీ మఠం స్థలంలో ఈ నెల 11, 12 న చాగంటి కోటేశ్వర్‌రావు ప్రవచనాల కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. ఇందు కోసం ఆయన బ్రాహ్మణ సంఘం పక్కనే గల శ్రీ మఠం స్థలాన్ని అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. అధికారులకు తగు సూచనలు అందించారు. ఈనెల 19న ఆది జగద్గురు శంకరాచార్యులు వేములవాడ క్షేత్రానికి వస్తున్నారని ఆయన పేర్కొన్నారు. 20న ధర్మపురి క్షేత్రానికి రావాలని ఆహ్వానిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి

కొడిమ్యాల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : రైతులు కూరగాయల సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి బాస్కర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రలోని రైతు వేదిక, పూడూర్, తిర్మాలాపూర్ రైతు వేదికలలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. కొడిమ్యాల మండల కేంద్రంలో రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో డీఏవో, జిల్లా ఉద్యా అధికారి శ్యాంప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి శ్యాంప్రసాద్, ఏవో పి. జ్యోతి, వెటర్నరీ డాక్టర్ రాకేష్, ఏఈవోలు, మాజీ సర్పంచు రాంరెడ్డి, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు. మండలంలోని గౌరాపూర్, పూడూర్ గ్రామాల్లో పెద్ది బీరయ్య, కాసాని శేఖర్ కూరగాయాల తోటలను మంగళవారం ఉద్యాన విస్తరణ అధికారి అనిల్ పరిశీలించారు.

మహర్షి వాల్మీకి జీవితం స్ఫూర్తిదాయకం

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 07 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి ధర్మం, న్యాయం, సత్యం, సేవా మార్గాలను చాటిన ఇతిహాసాన్ని మానవాళికి అందించిన మహాకావ్య రచయిత ఆది కవి వాల్మీకి అని కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం వాల్మీకి జయంతిని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వాల్మీకి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు బీఎస్ లత, రాజాగౌడ్, బిసి సంక్షేమా శాఖాధికారి గుండేటి సునిత పాల్గొన్నారు.

●జగిత్యాలరూరల్: మహర్షి వాల్మీకి జీవితం ఈ సృష్టి ఉన్నంతకాలం స్ఫూర్తినిస్తూనే ఉంటుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామంలో వాల్మీకి బోయసంఘం ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకి కీర్తి ప్రతిష్టలను ఆయన జన్మదినం సందర్భంగా స్మరించుకోవడం పూర్వజన్మ సుకృతమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నక్కల రవీందర్‌రెడ్డి, భూపెల్లి శ్రీనివాస్, నోముల శేఖర్‌రెడ్డి, ఎల్లాలరాజిరెడ్డి, కొట్టాల మల్లేశం, పడిగెలస్వామిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పెద్దగంగారాం, చిన్నగంగారాం, భోగరాజం, భోగసతీష్, తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

●మల్లాపూర్: మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి పూజలు చేసి వేడుకలను జరిపారు. కార్యక్రమంలో నాయకులు, యువత, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

పెగడపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలోని పాతవాడ హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి గాను మండల కేంద్రానికే చెందిన రాచూరి ఆంజనేయులు మంగళవారం రూ.20,116లు విరాళం అందజేశారు. ఆలయకమిటీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్‌కు నగదు అందజేయగా రశీదు అందించి అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాంచంద్రం, నర్సింహారెడ్డి, పార్థసారథి పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

రాయికల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గర్భిణీలు పోషకాహారం తీసుకోవాలని సీడీపీవో మమత అన్నారు. మండలంలోని తాట్లవాయి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసం సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. స్థానికంగా లభించే చిరుధాన్యాలు, పప్పులు, కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు రోజు తీసుకునే ఆహారంలో తీసుకోవాలన్నారు. గర్భిణీల గృహ సందర్శనలు చేసి బరువు, రక్తహీనత, రోజు తీసుకునే ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుజాత, చిట్టెమ్మ, విజయ, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

●పెగడపల్లి: పోషకాహారం ఆరోగ్యవంతమైన జీవనానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, గర్భిణీ స్త్రీలు, బాలింతలు పోషకాహారం గూర్చి అవగాహన కలిగి ఉండాలని పెగడపల్లి మండల ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుభద్ర పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని ల్యాగలమర్రి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసం నిర్వహించారు.

సర్పంచ్ ఆశావహుడి ద్విచక్ర వాహనం ధ్వంసం

-బరిలో ఉండొద్దని బెదిరింపు లేఖ

మల్లాపూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం గుండంపల్లి గ్రామంలో అందే రాజేష్ అనే సర్పంచ్ ఆశావహుడి ద్విచక్ర వాహనాన్ని కొద్ది రోజుల క్రితం దుండగులు ధ్వంసం చేయగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సర్పంచ్‌గా నిలబడితే బండికి పట్టిన గతే పడుతుందని రాసి ఓ లేఖ వదిలి వెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుండంపల్లి గ్రామ సర్పంచ్ పదవి ఎస్సీ జనరల్ కేటగిరి కేటాయించారు. గ్రామానికి చెందిన అందే రాజేష్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రజల మద్దతు కోరుతున్నాడు. ఇది గిట్టని దుండగులు రాజేష్ కదలికలపై దృష్టి సారించారు. దసరా పండుగ అనంతరం ఈనెల 4న రాజేష్ ద్విచక్ర వాహనంపై పొలం పనులకు వెళ్లాడు.

రాజేష్ ద్విచక్ర వాహనాన్ని పక్కకు నిలిపి వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లడాన్ని దుండగులు గమనించారు. అనంతరం ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశారు. ఈఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

'స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి'

మేడిపల్లి, అక్టోబరు 7: భీమారం, మేడిపల్లి మండలాల్లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మేడిపల్లిలో మేడిపల్లి- భీమారం మండలాల ఎన్నికల సన్నహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం విప్ పాల్గొని కార్యకర్తలు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, మాదం వినోద్, బొంగోని రాజాగౌడ్, చేపూరి నాగరాజు, జెలందర్, దామోదర్, నారాయణరెడ్డి, బలగం రాజేష్, లాజర్, సాల్మన్, తోకల నర్సయ్య, యూసుఫ్, అనంద్, మారుతిగౌడ్, వైయస్‌గౌడ్, జిన్న నరేష్, శంకర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

నిబంధనల మేరకే పురుగు మందులు విక్రయించాలి..

ఇబ్రహీంపట్నం, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకే పురుగు మందులను విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గల ఫర్టిలైజర్స్ దుకాణాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో గల పురుగుమందుల విక్రయాల రిజిస్టర్‌ను, పురుగుమందుల కంపెనీల వివరాలను పరిశీలించారు.

ఓపెన్‌స్కూల్‌లో చేర్పించాలి

కథలాపూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి, ఇంటర్ చదివేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిన నేపథ్యంలో ఓపెన్ స్కూల్‌లో వంద మంది మహిళలను చేర్పించాలని సెర్ప్ ఏపీఎం చిన్నరాజయ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో వీఓఏలకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు చదువుకోని నిరక్షరాస్యులైన వారిని ఓపెన్ స్కూల్ విధానంలో పరీక్షలు రాయించవచ్చన్నారు. ఈ ఓపెన్ స్కూల్‌లో చేరేందుకు ఈ నెల 13 తుది గడువు ఉన్నందు వల్ల మహిళలకు వివరించాలని పేర్కొన్నారు. అదేవిధంగా బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి రుణాల లక్ష్యం, రికవరీలపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా సీసీలు తెడ్డు అంజయ్య, తిరుపతి, రాజు, విజయలక్ష్మీ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న వేళ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ హరీష్‌కుమార్ సూచించారు. మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ఆరోగ్య, సంబంధిత శాఖల సిబ్బందితో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న వేళ నీరు నిలువ ఉండి దోమల వ్యాప్తి పెరిగి మలేరియా,డెంగ్యూ, మెదడు వాపు, చికెన్ గున్యా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంద సూచించారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయభాస్కర్, సుల్తానా, నర్సింగ్ ఆఫీసర్ రాజేందర్,సూపర్వైజర్లు హేమలత పిఏచ్ఎన్ కృపాకర్, సుశీల, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.